THE WORD OF TRUTH

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల
## సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

హిందీ — SATYA SUSAMACHAR

మంగళవారము
గురువారము } 9.00 to 9-15 p. m.
శుక్రవారము

ఆదివారము — 1-30 to 1-45 p. m.

ఇంగ్లీషు — The Voice of Truth

ఆదివారము — 9-30 to 9-45 p. m.
మంగళవారము — 9-30 to 9-45 p. m.

తమిళం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము — 6-45 to 7-00 p. m.
శుక్రవారము — 6-45 to 7-00 p. m.

మలయాళం — The Voice of Truth

మంగళవారము — 3-45 to 4-00 p. m.
శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

**SATYA VANI**
**P. O. Box 80, KAKINADA-533 001**

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE

*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity

సంచిక **5** డిసెంబరు **1981** సంపుటి **2**


# సంపాదకీయము

## దినములు ఆచరించుటను గూర్చి

*( On Observing Days )*

అపొస్తలుడైన పౌలు గలతీయులలోని తన సహోదరులకు ఈ దిగువ మాటలను వ్రాసెను: "మీరు దినములను, మాసములను, ఉత్సవ కాలములను, సంవత్సరములను ఆచరించుచున్నారు. మీ విషయమై నేను పడిన కష్టము వ్యర్థమై పోవునేమో అని మిమ్మును గూర్చి భయపడుచున్నాను" (గలతీ 4:10, 11). దీని సందర్భమును చూచుచుండగా ఈ లేఖకుడు యూదా మతమును, మోషే ధర్మశాస్త్రమును వీడి క్రీస్తును వెంబడించుచున్న వారికి ఈ హెచ్చరికలను వ్రాసినట్లు కనుగొనగలము. అది క్రైస్తవ్యము యొక్క ఆరంభదినములు గనుక కొందరు తమకు తాము దృఢపడినవారు కారు. ధర్మశాస్త్రమును గూర్చి వారు పునరాలోచించుటకు మొదలిడిరి. వారు దినములను, మాసములను, ఉత్సవకాలములను, సంవత్సరములను ఆచరించ

నిమిత్తము వెనుకకు మరలునట్లు శోధింపబడిరి. ధర్మశాస్త్ర ప్రకారము వారు సంవత్సరములో వివిధ సమయములందు విశ్రాంతి దినమును, అనేక పండుగ దినములను, పండుగలను వారు ఆచరించుచుండిరి. వారు దేవునికి లోబడి క్రైస్తవు లగుటలో వాటి యంతటి నుండియు విడుదల పొందిన తరువాత బలహీనమైనవియు, నిష్ప్రయోజనమైన వియునైన వాటి తట్టు వారు మరల తిరుగనేల యని పౌలు తెలిసికొన గోరెను (గలతీ 4:9). అందువలన వారి విషయమై అతడు పడిన కష్టము వ్యర్థమై పోవునేమో యని పౌలు వారిని గూర్చి బాధపడెను (గలతీ 4:11). అతడింకా ఇట్లనెను: "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు, కృపలో నుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:4).

క్రీస్తు ఈలోకమందు జన్మించెనని నిశ్చయముగా మన మెరుగుదుము. ఆయన రాకడను గూర్చి అనేక ప్రవచనము లీయబడెను. మత్తయి మొదటి అధ్యాయములోను, మిగిలిన లేఖన భాగములయందును వాటి నెరవేర్పును మనము చదువుకొనగలము. ప్రపంచ చరిత్ర ఆయన జననమును గుర్తించుచున్నది. అయినను కూడ ఆయన జన్మించిన తేదీ యొక్క ఖచ్చిత వివరములు లేఖనములయందు ఈయబడలేదు. అట్లే క్రీస్తు సిలువపై చనిపోయెనని, అది సబ్బాతుకు ముందు రోజున జరిగెనని మరియు ఆయన వారములో మొదటి దినమందు సమాధిని జయించి తిరిగి లేచెనని లేఖనములు బోధించుచున్నట్లు మన మెరుగుదుము (మత్తయి 28:1-10). అయితే మరల దీని యంతటికి ఒక ప్రత్యేక తేదీ ఇయ్యబడలేదు. మరొక మాటలో ప్రభువు యొక్క జననమును గూర్చి, ఆయన పునరుత్థానమును గూర్చిన సంవత్సరము, మాసము, తేదీలు లేఖనములలో ప్రత్యేకముగా కనబడకున్నవి.

ముందు చెప్పుచున్న రీతిగా ఆయన ఆదివారమున సమాధి నుండి తిరిగి లేచెనని చెప్పబడినది. అయితే ఆయన ఏ ఆదివారమున లేచెనో అనగా నెలలో మొదటి ఆదివారముననో లేక రెండవ ఆదివారముననో మరింకో ఆదివారముననో మనకు చెప్పబడి యుండలేదు. అయితే ప్రశ్న ఏమంటే ఆ తేదీలు ఎందుకు రికార్డు చేయబడలేదు? నిశ్చయముగా అంత ప్రాముఖ్యమైన సంగతి గుర్తింపబడకుండ మరచిపోవుట జరుగదుగదా. గనుక దానికొక కారణ మున్నదని, ప్రభువు ఉద్దేశ్య పూర్వకముగా భూమిని కంపింపజేయు ఈ సంఘటనల తేదీలు మనకు ఈయలేదని మనము గ్రహించుకొన వలెను. మరల ఆ తేదీలను ఆయన ఎందుకు ఇయ్యలేదు?

ఇంతకు ముందు చెప్పబడిన రీతిగా మోషే ధర్మశాస్త్ర ప్రకారము విశ్రాంతిదినము, ప్రత్యేక పండుగదినములు, సందర్భములు ఆచరింపబడేవి. చివరకు అవి కేవలము నామకార్థముగా ఆచరింపబడుచు వాటి భావమును కోల్పోయినట్లుగా తయారయ్యెను. క్రీస్తు రాకతలో అదంతయును, మిగిలిన ధర్మశాస్త్ర మంతయును తీసివేయబడెను (కొలస్స 2:14). అట్టి దినముల నాచరించుటకు మానవుడు ఇక మీదట బద్ధుడు కాజాలడు. ప్రత్యేకముగా క్రీస్తు రాకడను గూర్చిన సందర్భములో ఆయాదినములను గొప్పగాచేసి ఆచరించే మానవుని బలహీనతను ఎరిగినవాడై ఆయన జననమును గూర్చియు పునరుత్థానమును గూర్చియు ఉన్న తేదీలను మానవులు ప్రత్యేక పండుగ దినములుగా ఆచరించి ఆరాధన దినములుగా చేయకుండు నిమిత్తము ప్రభువు వాటిని రహస్యముగా ఉంచెను.

పైన చెప్పుచున్నది వాస్తవమే అయినను, క్రీస్తు జననమునకును నేటికిని మధ్య నున్న కాలములో ఎప్పుడో మానవుడు ఆయన జనన పునరుత్థాన దినముల యొక్క తేదీలను తయారుచేసి యున్నాడు. నిజానికి ఒక్క తేదీ కాదుగాని అనేక తేదీల నతడు తయారు చేసాడు.

కొందరు ఒక తేదీని, మరికొందరు మరొక తేదీని అంగీకరించెదరు. ఎక్కువమందిచే అనుసరించబడు ప్రసిద్ధి గాంచిన తేదీ కొన్ని వందల సంవత్సరముల క్రితము తయారు చేయబడెను. అయితే ప్రభువు తన వాక్యములో అట్టి తేదీలను బయలు పరచుటకు ఇచ్ఛయించని యెడల, మానవులచే తయారు చేయబడిన తేదీలను మనము అంగీకరించి ప్రభువు జననమునకు గౌరవార్థముగా క్రిస్మసు అని పిలువబడే దినమును, ఆయన పునరుత్థానమునకు గౌరవార్థముగా ఈస్టరు అని పిలువబడే దినమును ఆచరించునపుడు ప్రభువు మనలను గూర్చి సంతోషించునని నీవనుకొనుచున్నావా ?. నిజానికి క్రైస్తవలోకమని పిలువబడేవారు క్రైస్తవ్యాన్ని మోషే ధర్మశాస్త్రము చొప్పున అవలంబింపబడే దానిగా కించపరచి యున్నారు. మిగిలిన మతస్థులకుండే పండుగలను బట్టి వాటివలెనే దానిని తయారు చేసారు.

నిజక్రైస్తవులు అనగా క్రీస్తు సంఘసభ్యులు క్రిస్మసునుగాని, ఈస్టరునుగాని ఆచరించరు. మేము క్రీస్తు జననమునందును, ఆయన పునరుత్థానమునందును విశ్వసింపమని దాని యర్థమా ? అట్లు కానేకాదు. సరిగదా మేము వాటిని నిశ్చయముగా నమ్ముదుము. ఈవిషయాల్లో లేఖనముల ననుసరించి యుండునంతమట్టుకు మేము నమ్ముదుము. యేసు ఈలోకములో జన్మించినందు వలన మేము దేవునికి కృతజ్ఞత చెల్లించు చున్నాము. అంతేకాదు మన పాపముల కొరకు ఆయన సిలువపై మరణించుటకు ఇష్టపడినందునను, మూడు దివా రాత్రిముల తరువాత ఆయన సమాధిని జయించి లేచి మన ప్రభువుగాను, యజమానిగాను యున్నందునను దేవునికి మేము మరింత ఎక్కువ కృతజ్ఞత కలిగి యున్నాము. ఆయన నామమందు మేము ప్రతి ఆదివారమున ప్రభు రాత్రి భోజనములో పాలు పొందుటకు కూడుకొనునప్పుడు ఆయన శరీరమునకు గురుతుగా రొట్టెను భుజించి, ఆయన రక్తమునకు గురుతుగా ద్రాక్షారసమును పానము చేసి ఆయనను జ్ఞాపకము చేసికొందుము.

మనము పాపక్షమాపణను పొంది నిత్యజీవ నిరీక్షణను కలిగియుండు నిమిత్తము ఆయన రక్తము చిందింపబడెనని మేము ఆయనను జ్ఞాపకము చేసికొందుము (1 కొరింథీ 11:23-29). దీనిని చేయుటలో ఆయన మరణ సమాధి పునరుత్థానములను పునరాలోచన చేసికొనుటయేగాక తద్వారా ఒకానొక దినమందు ఆయన మరల రాబోవు చున్నాడని మేము జ్ఞాపకము చేసికొనుచు దానిని ప్రజలందరికి తెలియజేయుదుము. దీనిద్వారా మనము హెచ్చరింపబడుదుము. క్రీస్తునందు మనకున్న విశ్వాసమును లోకమునకు ప్రకటింతుము. మరియు ఆయన చెప్పిన దానిని చేయుటలో ప్రభువును మహిమ పరతుము.

ఒకడు క్రైస్తవుడైనప్పుడు క్రైస్తవులని చెప్పుకొనువారిలో అనేకులు క్రిస్మసును, ఈస్టరును ఆచరించుటవలన కొన్నిసార్లు అట్టి వాటిని విడిచిపెట్టుట కష్టమగును. కొందరు ఈ పండుగలలో పాలు పొందుటకు ప్రయత్నించుచుందురు. పౌలు కాలమందున్న క్రైస్తవులలో కొందరు మోషే ధర్మ శాస్త్రమునొద్దకు వెనుకకు వెళ్ళుటకు ప్రయత్నించిన సందర్భమును ఇది మనకు గుర్తుచేయుచున్నది. ప్రభువుకు నమ్మకముగా యుండవలెనంటే మనము అట్లు చేయలేము. ఒకడొక మతమును విడనాడి క్రైస్తవుడైనప్పుడు ఆ మతములో యున్న పండుగలను అతడాచరించినయెడల ప్రభువు నిశ్చయముగా అతనిని అభినందించడు. క్రీస్తునందు విశ్వాసులమని చెప్పుకొనువారు కూడ వాక్యములో లేని పండుగదినములను ఆచరించునప్పుడు నిజ క్రైస్తవుడు వారి ననుసరింపకూడదు. మనము ప్రభువుయొక్క జనన మును, పునరుత్థానమును ఆచరించవలెనని ప్రభువు కోరినయెడల ఆయా తేదీలను ఆయన తన వాక్యమందు బయలుపరచియుండును. అప్పుడు వాటిని గూర్చిన సంశయము ఏమియు లేకుండును.

మేము క్రిస్మసును, ఈస్టరును ఆచరించము అని చెప్పునప్పుడు మతశాఖలలోయున్న మా మిత్రులు దానిని నమ్మలేక పోవుచున్నారు.

ఆయా దినాల్లో జరిగే ప్రత్యేక ఆరాధనను గూర్చి వాటిద్వారా కుటుంబాలకు కలిగే మేలునుగూర్చి వారు మాకు జ్ఞప్తి చేయుదురు. అయితే ఆయా దినములు లేక పండుగల ఆచరణలో జరిగే అనేక అత్యాచారములను గూర్చి, అవినీతి క్రియలను గూర్చి ఆ మిత్రులకు మేము కూడ జ్ఞప్తి చేయగలము. అయితే మేము మానవుని చట్టములకు గాక క్రీస్తుయొక్క అధికారమునకు బద్ధులమై యున్నాము. ఇందులో గొప్ప వ్యత్యాసమున్నది.

నీవు దేవుని వాక్యోపదేశమునకు తిరిగి వచ్చి మానవులు కల్పించిన పండుగలు, ప్రత్యేక దినములు పారంపర్యాచారములు మొదలగు వాటినుండి విడుదల పొందుమని నేను నిన్ను ఆహ్వానించుచున్నాను. క్రీస్తునందున్న స్వాతంత్ర్యమునుబట్టి మనము ఆయన కోరినరీతిగ ఆరాధించెదము. అట్లు ఆయనను గౌరవించి మహిమ పరచుటలో కలుగు ఆనందము, సంతృప్తి, సంతోషాన్ని పంచుకొందము.

---

# సబ్బాతు సంగతి ఏమిటి?

## *( What about the Sabbath ? )*

—ఆల్బర్ట్ గార్డ్నర్

### వివాదాంశము

మేము సెవెంతుడే అడ్వెంటిస్టు వారితో ఏకీభవించుచున్న అనేక సంగతులున్నవి. మేమిపురము బైబిలును నమ్ముదుము. బైబిలు దేవుని నుండి కలిగెనని, మనము దాని ననుసరించవలెనని మేము నమ్ముదుము. క్రీస్తు పాపులకొరకై మరణించు నిమిత్తము వచ్చెనని మేము నమ్ముదుము. ఒక ధర్మశాస్త్రము లేక చట్టము సిలువకు మేకులతో కొట్టబడెను గనుక అది అంతమాయెనని మేమిరువురము నమ్ముదుము. అయితే సిలువ యొద్ద అంత మొందినది ఏ చట్టమో

అను సంగతిపై మేము భేదము కలిగి యున్నాము. అది మా మధ్య యున్న వివాదాంశము. ఈ అంశముపై మేము ఏకీభవించ గలిగిన యెడల మిగిలిన భేదములు స్వల్పములగును.

ధర్మశాస్త్రమును గూర్చి ముఖ్యముగా సబ్బాతును గూర్చి సెవెంతుడే అడ్వెంటిస్టు వారు గైకొనిన స్థానము విపులముగాను, పరిష్కారముగా ఇక్కడ తెలియజెప్పుటకు నేను సంకల్పించితిని:

యూదులు రెండు ధర్మశాస్త్రములను గైకొనిరని వారు నమ్ముదురు. దానిలో ఒకటి దేవుని ధర్మశాస్త్ర మనియు, రెండవది మోషే ధర్మశాస్త్ర మనియు పిలువబడెను. 'దేవుని ధర్మశాస్త్రము' అంతయు పది యాజ్ఞలలో యుండెను. అది నైతిక చట్టమని పిలువబడెను. ఈ నైతిక చట్టము ఇప్పుడు అమలులో యున్నది, మరియు కాలాంతము వరకు అమలులోనే యుండును. ఏడవదిన సబ్బాతు పది యాజ్ఞలలో ఒకటి గనుక, పది ఆజ్ఞలు ఇప్పుడు అమలులో యున్నవి గనుక, ఏడవ దిన సబ్బాతును గూర్చిన ఆజ్ఞను ఇప్పుడు పాటించుట చట్టబద్ధమై యున్నది.

'మోషే ధర్మశాస్త్రము' విధిరూపక చట్టమై (Ceremonial Law) యున్నది. అది సిలువ యొద్ద అంత మొనర్చబడెను. ఈ ఆచార యుక్త చట్టములో దహనబలులు, నైవేద్యములు, బలులు, పండుగ దినములు, నెలసరి సబ్బాతులు మొదలగునవి యుండెను. ఇవన్నియును సిలువ యొద్ద సమాప్త మాయెను. ఈ చట్టము తీసివేయబడెను గాని 'దేవుని ధర్మశాస్త్రమును' మాత్రము ఇప్పుడును అనుసరించవలెను అని ఎడ్వెంటిస్టువారు నమ్ముదురు.

అయితే బైబిలు ఇట్టి వ్యత్యాసమును కనపరచుచున్నదో లేదో మనము నిర్ణయించుట అత్యవసరము. ఒక చట్టమును దేవుని ధర్మ

శాస్త్రమని, మరొకదానిని మోషే ధర్మశాస్త్రమని, బైబిలు పిలుచు చున్నదా?

## మోషే ధర్మశాస్త్రము, దేవుని ధర్మశాస్త్రము

మోషే ధర్మశాస్త్రము, దేవుని ధర్మశాస్త్రము అనునవి ఒక్కటే గాని రెండు కావు. ఇవి ఒకే ధర్మశాస్త్రమున కీయబడిన రెండు పేరులు. ఒకే ధర్మశాస్త్రమునకు బైబిలు లేఖకులు దేవుని ధర్మశాస్త్రము, మోషే ధర్మశాస్త్రము అను పదములను పరస్పరముగా వినియోగించిరి.

ఎజ్రా అను శాస్త్రి మోషే ధర్మశాస్త్ర గ్రంథమును తెప్పించెను (నెహెమ్యా 8:1). మరియు దానిని ప్రజలకు అతడు చదివి వినిపించెను. అది దేవుని ధర్మ శాస్త్ర గ్రంథమనబడెను (నెహెమ్యా 8:8, 18). అక్కడ రెండు ధర్మశాస్త్రములు లేవు గాని ప్రజలకు ఒకే ధర్మశాస్త్ర గ్రంథమునుండి చదివి వినిపించబడెను. ఒకే ధర్మశాస్త్రమును గూర్చి దైవావేశ లేఖకుడు ఈ రెండు పదములను వినియోగించెను. అది ఒక్కటే యని దేవుడు సూచించుచుండగా దానిని రెండుగా చేయు హక్కు యెవనికున్నది?

దేవుని ధర్మశాస్త్రము నైతిక చట్టమనియు (Moral Law), మోషే ధర్మశాస్త్రము ఆచారయుక్త చట్టమనియు అడ్వెంటిస్టువారు బోధింతురు. ఒక చట్టము సిలువకు మేకులతో కొట్టబడెను గాని అది ఆచారయుక్త చట్టమగు మోషే ధర్మశాస్త్రమని వారు బోధింతురు. అయితే ఇది బైబిలు కనుపరచని వ్యత్యాసమై యున్నది. 1 దిన వృత్తాంతములు 16:39, 40 లో కొన్ని విధులు యెహోవా ధర్మశాస్త్రములో యున్నట్లు మనము చూడగలము. "యెహోవా ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించిన ధర్మ శాస్త్రమందు వ్రాయబడియున్న ప్రకారము ఉదయాస్తమయములందు అనుదినమున నిత్యమైన దహన బలిని అర్పించుటకై . . . యాజకులను నియమించెను".

అడ్వెంటిస్టువారి సిద్ధాంతము రైటు అయితే, ఈ లేఖన భాగము తప్పు. ఈ దహన బలులు 'మోషే ధర్మ శాస్త్రములో వ్రాయబడియున్న ప్రకారము' అని లేఖకుడు వ్రాసియుండవలసినది గాని అత డట్లు చేయలేదు. సరిగదా అవి యెహోవా ధర్మ శాస్త్రములో వ్రాయబడియున్న ప్రకారము అని అతడు ఖచ్చితముగా వ్రాసెను. యేసు చనిపోయినప్పుడు దహన బలులు, బలి పీఠము ఎత్తివేయబడెను. అవి యెహోవా ధర్మ శాస్త్రములో వ్రాయబడెను గనుక 'యెహోవా ధర్మ శాస్త్రము' సిలువయొద్ద అంతమొందెనని మనము గ్రహించు కొనవలెను.

దహన బలులను, సబ్బాతును 'యెహోవా ధర్మ శాస్త్రము' నందు ఇమిడ్చిన మరియొక లేఖన భాగము 2 దిన వృత్తాంతములు 31:3. "మరియు యెహోవా ధర్మ శాస్త్రమునందు వ్రాయబడియున్న విధినిబట్టి జరుగు ఉదయాస్తమయముల దహన బలులను, విశ్రాంతి దినములకును, అమావాస్యలకును నియామక కాలములకును ఏర్పడి యున్న దహన బలులను అర్పించుటకై తనకు కలిగిన ఆస్తిలోనుండి రాజు ఒక భాగమును ఏర్పాటుచేసెను".

దహనబలులు, విశ్రాంతి దినములు, పండుగలు యెహోవా ధర్మశాస్త్రమునందు వ్రాయబడియుండెను. అడ్వెంటిస్టువారి సిద్ధాంతము రైటు అయితే అవి అక్కడ గాక మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడి యుండవలెను. దహనబలులు సిలువయొద్ద అంతమొందెనని అడ్వెంటిస్టువారు బోధింతురు; దహనబలులు అంతమొందిన సమయమునందే సబ్బాతు కూడా అంతమొందెను. అవి ఒకే ధర్మశాస్త్ర మందున్న సంగతులని బైబిలు విపులముగ బోధించుచున్నది.

యోషీయా ఏలుబడిలో 'మోషేద్వారా యెహోవా దయచేసిన ధర్మశాస్త్ర గ్రంథము యాజకుడైన హిల్కీయాకు కనబడెను'

(2 దిన 34:14). ఆ గ్రంథము రాజునొద్దకు తేబడగా రాజు తన ప్రజల యొక్క భక్తి జీవితములో అవుసరమగు మార్పులను, దిద్దుబాటులను చేయ నారంభించెను. ఈ మార్పులను గూర్చి మనము చదువుచుండగా ప్రజలు పస్కాను ఆచరించుటకు మొదలిడుటను గమనించగలము (2 దిన 35:1). యెహోవా ధర్మశాస్త్రమును బట్టి ఈ విధిని ఆచరించుట వింతయైనది కాదు (2 దిన 35:26); ఏలయనగా యూదుల యుగంలో రెండు ధర్మశాస్త్రములు లేవు. యెహోవా ధర్మశాస్త్రము ఒకటి, మోషే ధర్మశాస్త్రము ఇంకొకటి యను చేయు బోధ బైబిలు సంబంధమైనది కాదు. నీవు దేని నంగీకరింతువు? మానవుల బోధనా? లేక దేవుని బోధనా?

యూదుల చట్టప్రకారము మగశిశువునకు ఎనిమిదవ దినమున రెండు సంగతులు జరిగేవి. యేసు యూదునిగా జన్మించెను గనుక ఎనిమిదవ దినమున ఆయనకు పేరు పెట్టబడుట, సున్నతి చేయబడుట జరుగవలెనని మనము ఎరుగుదుము. దీనియొక్క రికార్డు లూకా 2:11-24 లో మనకు లభించును: "ఆ శిశువునకు సున్నతి చేయవలసిన యెనిమిదవ దినము వచ్చినప్పుడు, గర్భమందాయన పడక మునుపు దేవదూతచేత పెట్టబడిన యేసు అను పేరు వారు ఆయనకు పెట్టిరి. మోషే ధర్మశాస్త్రము చొప్పున వారు తమ్మును శుద్ధిచేసుకొను దినములు గడచినప్పుడు ప్రతి తొలిచూలు మగపిల్ల ప్రభువుకు ప్రతిష్ఠ చేయబడవలెను అని ప్రభువు ధర్మశాస్త్రమందు వ్రాయబడినట్టు ఆయనను ప్రభువుకు ప్రతిష్ఠించుటకును, ప్రభువు ధర్మశాస్త్రమందు చెప్పబడినట్లు గువ్వల జతనైనను రెండు పావురపు పిల్లలనైనను బలిగా నర్పించుటకును వారు ఆయనను యెరూషలేమునకు తీసికొనిపోయిరి".

మరియు శుద్ధిచేసికొను ఆచారము మోషే ధర్మశాస్త్ర ప్రకారమైనదని లూకా చెప్పుట నీవు గమనించితివా? ఎడ్వెంటిస్టువారి బోధ

ప్రకారము ఆ యాచారము వ్రాయబడవలసినది అక్కడనే. అయితే 24వ వచనములో గువ్వల జతను, రెండు పావురపు పిల్లలను సమర్పించుట ప్రభువు ధర్మశాస్త్రమందు చెప్పబడెనని లూకా వ్రాసెను. ఈ యాచారములను మోషే ధర్మశాస్త్రము, ప్రభువు ధర్మశాస్త్రము అను పదములను బట్టి అతడు సూచించెను.

లూకా పొరబడెనా? ప్రభువు ధర్మశాస్త్రములో కేవలము పది యాజ్ఞలే యున్న యెడల, ప్రభువు ధర్మశాస్త్రములో వ్రాయబడినట్లు బలి నర్పించుడి యని అతడు ఎందుకు చెప్పెను? మనము లూకాను నమ్మవచ్చునా? అతడు ఒక అబద్ధ సాక్షియా? ఈ విషయములో పొరబడిన యెడల అతడు దైవావేశము కలిగి యుండెనా? అతడు దివ్య ప్రేరణ కలిగి యుండని యెడల, అపొస్తలుల కార్య గ్రంథమును కూడా అతడు వ్రాసెను గనుక సంఘారంభమును గూర్చియు, దాని ఆదిమ చరిత్రను గూర్చియు నమ్మదగిన వర్ణన మనకు ఎక్కడ లభించును? ప్రభువు ధర్మశాస్త్రమందు వ్రాయబడిన బలులనుగూర్చి అతడు నిజము చెప్పని యెడల, పెంతెకొస్తునాడు రక్షింపబడిన మూడు వేలమందిని గూర్చి అతడు నిజము చెప్పెనని మనకెట్లు తెలియును? అతడు నమ్మదగినవాడు కాని యెడల రక్షింపబడు విధానమును గూర్చి అపొస్తలుల కార్యములలో యున్న సందర్భములను ఎట్లు చూపించగలము? లూకా సత్యమునే చెప్పెను. దివ్య ప్రేరణ గల వక్త అతడు. అతడు వ్రాసిన ప్రతి మాటను నీవు నమ్మవచ్చును.

పాత నిబంధనలో రెండు ధర్మశాస్త్రములున్నవని యేసు బోధించలేదు. "నీ తలిదండ్రులను ఘనపరచవలెనని...మోషే చెప్పెను గదా" యని ఆయన చెప్పెను (మార్కు 7:10). "నీ తలిదండ్రులను ఘనపరచవలెనని మోషే చెప్పినట్లు మన ప్రభువు వక్కాణించెను. దానిని మోషే ఎక్కడ చెప్పెను? అది నిర్గమ 20:12 లో పది యాజ్ఞలలో ఒక ఆజ్ఞ యని దానిని మనము గుర్తించగలము. అడ్వెంటిస్టు

వారి ప్రకారము దానిని మోషే ఏమాత్రమును చెప్పలేదు ఏలయనగా ఆ పది యాజ్ఞలు దేవుని ధర్మశాస్త్రమై యున్నవి. యేసు ఈ లోక రక్షకుడు కాదా? నీ తలిదండ్రులను ఘనపరచవలెనని చెప్పినవా రెవరో ఆయనకు తెలియదా? అది దేవుని కుమారునికి తెలియదా? లేక ఆయన పొరబాటు చేసెనా? యేసుకు తెలియును, ఆయన పొర బాటు చేయలేదు, దానిని గూర్చి ఆయన సత్యమునే చెప్పెను. పాత నిబంధనలో రెండు ధర్మశాస్త్రము లున్నవను సిద్ధాంతమును యేసు బోధించలేదు. ఈ సిద్ధాంతము ఆధునికంగా ఆరంభమైనది. దానిని బైబిలు ఆమోదించుట లేదు.

మన ప్రభువడిగిన ఈ ప్రశ్నను గమనించుము: "మోషే మీకు ధర్మశాస్త్రము ఇయ్యలేదా? అయినను మీలో ఎవడును ఆ ధర్మశాస్త్రమును గైకొనడు; మీ రెందుకు నన్ను చంప జూచు చున్నారు?" (యోహాను 7:19). ధర్మశాస్త్రమును మోషే ఇచ్చి నట్లు ఆయన చెప్పెను. ఏ ధర్మశాస్త్రము? మోషే ఒక ధర్మశాస్త్రము నిచ్చెనని అడ్వెంటిస్టు వారంగీకరింతురు. గాని పది యాజ్ఞలను మోషే ఇచ్చినట్లు వారు నమ్మరు. మోషే ధర్మశాస్త్రము నిచ్చెనని, అయితే వారాయనను చంప జూచుచున్నారు గనుక వారు ధర్మశాస్త్ర మును గైకొనుట లేదని యేసు వారిని నిందించెను; ఏల యనగా నరహత్య చేయవద్దు అనునది పది ఆజ్ఞలలో ఒకటి. మోషే ధర్మ శాస్త్రము నిచ్చెనని ప్రభువు నిమ్మళ్ళగా చెప్పుచున్నప్పుడు అతడియ్య లేదని యెవడు చెప్పును? పది ఆజ్ఞలను మోషే కాదు దేవుడిచ్చెనని అడ్వెంటిస్టువారు బోధింతురు గనుక ఈ విషయములో వారి సిద్ధాంత మును బట్టి యేసు తప్పు.

(సశేషము)

# బైబిలు యొక్క దైవావేశము-3

*( The Inspiration of the Bible )*

—B. C. గుడ్‌వార్డ్

## దివ్య ప్రేరణ నిదర్శనములు

దివ్య ప్రేరణ నిదర్శనములు రెండువిధములుగాయున్నవి. అవి బాహ్యము, అంతరంగికము అనునవి. ప్రఖ్యాతిగాంచిన యూదుల గ్రంథకర్తలగు జోసిఫస్, ఫైలో అనువారు పరిశుద్ధాత్ముని పర్యవేక్షణలో పరిశుద్ధులగు మానవులచే పాతనిబంధన వ్రాయబడినట్లు యూదులు విశ్వసించిరి యని సాక్ష్యమిచ్చిరి. ఈ సమస్యయొక్క తత్వమును బట్టి బైబిలు దేవునివలన కలిగెనని చెప్పు నిదర్శనములు ప్రాముఖ్యముగా అంతరంగికమైనవి. ఏదైనా బాహ్యాధార నిదర్శనము కంటె అంతరంగిక నిదర్శనము మరింత నిష్కర్షమై యుండును. ఒక లోహపు కడ్డీ బంగారమని భావించబడినను దాని యథార్థత ప్రశ్నింపబడినప్పుడు ఆ లోహపు కడ్డీని పరీక్షించినయెడల సత్యమును కనుగొనవచ్చును. అదే విధముగా 'దైవప్రేరితమైనదని' చెప్పుకొను బైబిలు మనకు ఉన్నది. దానిపై దైవావేశ గురుతు లున్నవా? అంతరంగిక కఠిన పరిశీలనలో అది నిలుచునా? ఈగ్రంథము దేవునివలన కలిగెనను గురుతు లేమైనా దానిలో యున్నవో లేవో పరీక్షించే హక్కు మనకున్నది. అతికఠినమైన పరిశీలనను గూర్చి భయపడవలసిన పని దానికి ఏమియులేదు.

1. అది దేవునివలన కలిగినట్లు నిదర్శనముగా, బైబిలు విశ్వాస భ్రష్టత్వమును గూర్చిన ప్రతి ప్రాముఖ్యసంఘటనను గత 1900 సంవత్సరములలోను ముందాకట్టుకొని దానికి జవాబిచ్చెనను సత్యమును మనము చెప్పుకొనవచ్చును. ఒకటి రెండు ఉదాహరణలను మనము ఇక్కడ చెప్పుకొనవచ్చును. ద్రాక్షారసపు గిన్నెను రోమన్ కేథలిక్కు

సంఘము లౌకిక ప్రజ (laity) కు, ఆసంఘసభ్యులకు నిరాకరించెను. ఈదోషమును యేసు ముందుగనే ఎరిగినవాడుగా ప్రభురాత్రి భోజనమును స్థాపించుచు "దీనిలోనిది మీరందరు త్రాగుడి" యని చెప్పెను (మత్తయి 26:27). ఆధునిక వ్యక్తులు బుద్ధిహీనముగా చెప్పుచున్నట్లు ఈగిన్నెలోనిదంతయు మీరు త్రాగుడి యని గాక ఆగిన్నెలోనిది మీరందరు త్రాగుడి యని ఆయన చెప్పెను. శిష్యులు ఆయన మాటల నట్లు అర్థము చేసికొనిరి. "వారందరు దానిలోనిది త్రాగిరి" యని చెప్పబడెను. (మార్కు 14:23). మరల పౌలు ఇట్లనెను : "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. ఆ అబద్ధికులు వాతవేయబడిన మనస్సాక్షి గలవారై వివాహము నిషేధించుచు...కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము దేవుడు సృజించిన ఆహారవస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుచుందురు" (1 తిమోతి 3:1-3). రోమన్ కేథలిక్కు సంఘము తన నాయకులకు వివాహము నిషేధించెనని, దానిసభ్యులు కొన్నిదినములలో మాంసాహారము చేయరాదని ఆజ్ఞాపించెనని అందరు ఎరిగిన విషయమే. అట్లుచేయుటలో అది దయ్యముల బోధయందు లక్ష్యముంచెను. మాంసాహారమును నిషేధించుటలో ప్రొటెస్టాంటు సంఘములని చెప్పుకొనువారు 'వేశ్యలకు తల్లియైన' ఆమెను అనుకరించుటకు తహతహ లాడుచున్నారు. అట్టి ఆచారము లన్నిటిని బైబిలు ముందాకట్టుకొని ఖండించెను. ఈదోషములను ఏ లౌకికమైన మానవజ్ఞానము ముందుగనే కనిపెట్టి వాటికి జవాబీయలేదు. దీనికి సరియైన జవాబు దివ్య ప్రేరణయే.

2. అతి అధునాతన వైజ్ఞానిక జ్ఞానముకంటే బైబిలు ముందు ఉన్నది. అయినను విజ్ఞానశాస్త్ర ప్రబంధమువలె బైబిలు వ్రాయబడ లేదు. అది లిఖింపబడిననాటి ప్రజల భాషలో అదివ్రాయబడెను, అయి

నను వైజ్ఞానిక సత్యముతో వైరుధ్యముగల మాట ఏఒక్కటికూడా దానిలోలేదు. మోషేచే వివరించబడిన సృష్టిక్రమము ఆధునిక విజ్ఞాన. శాస్త్ర వివరణముతో ఏకీభవించి యున్నది. "ఆకాశ నక్షత్రములు లెక్కింప నశక్యమని" యిర్మియా చెప్పెను (యిర్మియా 33:22) అయితే మన పూర్వీకులు నక్షత్రములను లెక్కింపగలుగుట సాధ్యమే యని భావించిరి. వాటి సంఖ్యను లెక్కించితిమని వారు తలంచిరి. కాని ఇప్పుడు ఏ ఖగోళశాస్త్రజ్ఞుడు కూడా ఆకాశ నక్షత్రముల సంఖ్యను తెలిసికొనుటకు నిరీక్షించడు. యిర్మీయాకు ఈ సంగతి ఎట్లు తెలిసెను? అనేక శతాబ్దములక్రితము యోబు ఇట్లనెను: "శూన్యమండలముపైని ఉత్తర దిక్కుననున్న ఆకాశ విశాలమును ఆయన పరచెను. శూన్యముపైని భూమిని వ్రేలాడచేసెను" (యోబు 26:7). గురుత్వ చట్టమును (Law of gravitation) గూర్చి, భూమిని తన స్థానములో సరిగ నుంచు శక్తినిగూర్చి అతడెట్లు ఎరుగును? విజ్ఞానశాస్త్రము ఈసంగతులను కనుగొనక ఎంతో ముందు అతడు వీటినిగూర్చి చెప్పెను. అతనియొద్ద నవీన దూరదర్శిని ఏదీలేదు. సరిగదా అతడు ప్రపంచ యాత్రికుడు కాడు. భూమ్యాకాశములను గూర్చిన ఇంత ఖచ్చిత జ్ఞానము అతనికి ఎక్కడనుండి వచ్చెను? భూమియొక్క వర్తులాకారమును సూచించు పదజాలమును యెషయా వినియోగించెను. "ఆయన భూమండలముమీద ఆసీనుడై యున్నాడు. దాని నివాసులు మిడతలవలె కనబడుచున్నారు" అని అతడుచెప్పెను (యెషయా 40:22). మెజెల్లన్‌వలె యెషయా భూమిచుట్టూ ఎన్నడు సముద్రయానము చేసి యుండలేదు. ఆధునిక భూగోళశాస్త్రము, పటములు అతనికి లభించి యుండలేదు. అయితే అట్టిజ్ఞానము నతడెట్లు పొందగలిగెను? మానవులు గుండ్రముగా యున్న గోళముపై జీవించు వారని సూచించు భాషను యేసు వినియోగించెను. ఆయన రెండవ సారి వచ్చునప్పుడు ఇద్దరు మనుష్యులు పొలములో యుందురు, ఒకడు తీసికొనిపోబడును, ఒకడు విడిచిపెట్టబడును. ఇద్దరు స్త్రీలు

తిరుగలి విసురుచుందురు, ఒకతె తీసుకొనిపోబడును, ఒకతె విడిచిపెట్ట బడును అని యేసు చెప్పెను (మత్తయి 24:40, 41). ఆ రాత్రి యిద్దరొక్క మంచముమీద ఉందురు; వారిలో ఒకడు కొనిపోబడును, ఒకడు విడిచిపెట్టబడును అనికూడ ఆయన చెప్పెను (లూకా 17:34). యేసు ఈ మాటలు చెప్పిన కాలమందు సాధారణముగా ప్రజలు పగటివేళ పొలములోను, రాత్రివేళ మంచముమీద యుండేవారు. సంధ్యవేళ తిరుగలి విసిరేవారు. దీనినిబట్టి ఆయన వచ్చునప్పుడు కొన్నిచోట్ల పగలును, కొన్నిచోట్ల సంధ్యవేళయు, మరికొన్నిచోట్ల రాత్రివేళయు అయియుండునని యేసుయొక్క భావము. ఇది గుండ్రముగా యున్న భూమిమీదనే జరుగును. దీనిని యేసు ఎట్లు ఎరిగెను? ఆయన పాలస్తీనాలో జీవించి మరణించెను. బహు అరుదుగా ఆయన ఆ దేశమును వదిలెను. మధ్యధరాసముద్రము కనబడే ప్రాంతములో ఆయన జీవించెను గాని దానిని గూర్చి ఆయన ఎన్నడు పలుకలేదు. దాని నీటిపై ఆయన ఎన్నడయినా పయనించినట్లు నిదర్శనమేమియు లేదు. అయినను ఆయన వచ్చునప్పుడు గుండ్రముగాయున్న భూమిమీద ఉండు పరిస్థితులను గూర్చి ఎరిగిన వాడై పలికెను. దానిని ఆయన ఎట్లు తెలిసికొనెను? యేసును, మిగిలిన వారును కూడ వారి కాలముకంటె ముందున్న వైజ్ఞానిక సంగతులను గూర్చి ఎట్లెరిగిరి? సర్వశక్తుని ప్రేరణవలన వారు ఎరిగియుండిరనునదియే దానికి జవాబు.

8. మానవ ప్రవర్తనను చిత్రీకరించుటలో బైబిలు నిష్పక్షపాతము దాని గ్రంథకర్త దేవుడే యనుటకున్న మరొక నిదర్శనము. దివ్య ప్రేరణలేని మానవులు తాము శ్లాఘించికొనియాడు వారిని గూర్చి వ్రాయునప్పుడు, శ్లాఘనీయము కాని సంగతులను, పాపభరితమైన సంగతులను విడిచిపెట్టుట కద్దు. అయితే బైబిలు లేఖకులు అట్టివారు కారు. గొప్ప ధర్మశాస్త్రదాత, విమోచకుడు, ప్రవక్తయైన మోషే, చరిత్ర యంతటిలోను ఒక బ్రహ్మాండమైన వక్త. పాత నిబంధనలో ఎంతో ఘనముగా ఎంచబడిన వ్యక్తి అతడు. పాత నిబంధన

ఘనులందరిలో అతని పేరు ఒక్కటి మాత్రమే గొర్రెపిల్ల కీర్తనతో కలసియున్నది (ప్రకటన 15:4). అయినను ఒకబండయొద్ద మోషే యొక్క విచారకరమైన పాపమును, తత్ఫలితముగా వాగ్దానము చేయ బడిన దేశములో అతడు ప్రవేశించక పోవుటను బైబిలు బయలుపరచు చున్నది. దావీదు పాపము చేసెను. బైబిలులో అతని పాపములను గూర్చి వ్రాయబడెను. పేతురు పాపముచేసెను. అతడు తన ప్రభువును గూర్చి ముమ్మారు బొంకిన విషాదగాథ నమ్మకముగా బైబిలునందు లిఖించబడెను. పరిశుద్ధాత్మ ప్రభావములేని మానవులు వీరినిగూర్చి వ్రాయ వలసి వచ్చిన యెడల వారిపాపములను గూర్చి ఏమీ చెప్ప కుండా వదలివేసి యుందురు లేదా వాటిని బహు తేలికగా తీర్చివేసి యుందురు. అట్టినాయకుల జీవితములను అంత నిష్పక్షపాతము గను, నిష్కపటముగను వర్ణించినందున దాని గ్రంథకర్త దేవుడేగాని మరొకడు కాదని మనము పరిగణించక తప్పదు.

4. దివ్యప్రేరణకు మరియొక నిదర్శనముగా బైబిలు మానవ వినోదమును సంతుష్టిపరచ ప్రయత్నించదను వాస్తవమును చెప్పుకొన వచ్చును. వేడుకకు మానవుడు పడు తాపత్రయములను సంతుష్టిపర చుట కది ఎన్నడు తన్ను తాను కించపరచుకొనదు. దివ్యప్రేరణ లేక వ్రాయబడిన పుస్తకముల విషయములో ఈ సంగతి సత్యము కాదు. మానవులు తెలిసికొనాలని కోరే సంగతులను అనేకసార్లు బైబిలు రికార్డు చేయకుండా విడిచిపెట్టుట కద్దు. ఒకానొక సందర్భ మందు యేసు నేలపై రెండుసార్లు వ్రాసినట్లు చెప్పబడెను (యోహాను 8:1-8). ఆయన వ్రాసిన సందర్భము ఇది ఒక్కగా నొక్కటిమాత్రమే. ఆయన వ్రాసిన దేమిటో ప్రథమశ్రేణికి చెందిన వార్తయై యుండును గాని పాలస్తీనాయొక్క పవిత్రనేలపై ఆయన ఏమివ్రాసెనో మనకు తెలియదు. యేసు యొక్క కలమునుండి కలిగిన ఒక్కపుస్తకముగాని, ఒక్కవివరణగాని బైబిలునందు లేకపోవుట భావగర్భితమైనది. ఆయన బాల్యము , యౌవనము ఇంచుమించు చప్పుడు లేకుండగనే గడచి

పోయెను. పండ్రెండు సంవత్సరముల ప్రాయమునుండి ముప్పయి సంవత్సరములు వచ్చిన తరువాత ఆయన బాప్తిస్మము పొందువరకు ఆయన పెదవులనుండి వచ్చిన మాటలేమియు మనకు లేవు. పరిశుద్ధాత్మ ప్రేరేపణ లేక మానవులు ఆయననుగూర్చి వ్రాయుచుండినయెడల అదియెంత వేరుగా యుండునో గదా! మృతులలోనుండి లేపబడిన కొందరు వ్యక్తులనుగూర్చి బైబిలులో చెప్పబడినది. అయితే వీరిలో ఎవరునుకూడ తెరకు ఆవలివైపున వారుచూచిన దానినిగూర్చిగాని అనుభవించిన దానిని గూర్చిగాని ఒక్కమాటకూడా తీసుకొని రాలేదు. తెరకు ఆవలి వైపున నున్న నిత్యత్వమును గూర్చి వారి నాలుకలు బంధింపబడెను, వారి పెదవులు తాళము వేయబడెను. మానవులు వారి స్వజ్ఞానమును బట్టియు, ఇచ్ఛనుబట్టియు వ్రాయుచుండిన యెడల ఇది ఎంత వేరుగా యుండునోగదా. మానవుని వేడుకను సంతృప్తిపరచు నిమిత్తము వారు ఆవలివైపు జీవితమునుగూర్చి ఏదోకొంత చెప్పకుండ యుండలేరు. మోసగాండ్రు రహస్యములను ఎరిగినట్లు నటించి రాబోవు లోకమును గూర్చి చెప్పుటకు ప్రయత్నములు చేయుచుండుట మన మెరిగినదే. బైబిలుయొక్క నిశ్శబ్దతకూడ హెచ్చరిక పూర్వమైనది. అదియును, దాని మాటలును అది దేవునివలన కలిగినవని చెప్పుటకు నిదర్శనములై యున్నవి.

(మిగతా వచ్చే సంచికలో)

## నరకమును గూర్చిన సత్యము

## *(The Truth about Hell)*

ఎవడును నశింపవలెనని దేవుడు యిచ్ఛయించుటలేదు గనుక (2 పేతురు 3:9), నరకమునుగూర్చిన ఉపదేశమును ఆయన సమృద్ధిగా బయలుపరచెను. దానిని గూర్చి తలంచుట సంతోషదాయకము కాక పోయినను, అది దేవుని చిత్తముయొక్క బయల్పాటులో ఒక ముఖ్య భాగమై యున్నది. నరకము అనునది నిజము. నరకమును గూర్చిన మాట

క్రొత్త నిబంధనలో 12 సార్లు ఉపయోగింపబడెను. వాటిలో 11 సార్లు యేసు ఆ మాటను వినియోగించెను. ఈ ఘోర ప్రదేశములో ప్రవేశించు వారికి ఎట్లుండునో నీవెన్నడయినా ఆలోచించావా? నీవు నరకములో నిత్యము నాశనమైపోయిన యెడల ఎట్లుండునో నీకు తెలుసా?

ఈ ప్రదేశములో ప్రవేశించువారి ఘోరదుస్థితి ఎట్లుండునో మనకు పూర్తిగ తెలియజేయుటకు, ఆయన నెరుగనివారికి, సువార్తకు లోబడని వారికి సిద్ధపరచబడి ఈ ఘోర ప్రతిదండన స్థలమునుగూర్చి బైబిలులో దేవుడు మనకు పూర్తిగ బయలుపరచి యున్నాడు (2 థెస్స 1:7-9).

అందరు తెలిసికొనునట్లు దాని వాస్తవములు ఇక్కడ ఈయబడినవి. నరకమును గూర్చి లేఖనములలో అలంకారరీతిగను, గురుతులతోను వర్ణించబడినను, దాని యధార్థత వర్ణించబడినదానికంటె ఘోరముగ యుండునని మనము గమనించవలెను. ఇంకొక మాటలో చిత్రముకంటె దాని యధార్థత మరింత ఘోరమైనది! ఇక్కడ వ్రాయబడిన లేఖన భాగములను నీవు జాగ్రత్తగా, ప్రార్థనపూర్వకముగా, తీవ్రముగా చదువుము. వాటిని చదువుచుండగా, "నేను ఏదిశకు వెళ్ళుచున్నాను, పరలోకానికా, నరకానికా?" యని నిన్ను నీవు ప్రశ్నించుకొనుము.

## నరకములో యుండువారు

ఈ దిగువ నుదహరించినవారు నరకములో యుందురని బైబిలు బోధించుచున్నది :

అపవాది, అతని దూతలు (మత్తయి 25:41).

కుక్కలు, మాంత్రికులు; నరహంతకులు (ప్రకటన 22:15).

అపవిత్రులు, అవినీతిపరులు (ప్రకటన 22:11).

ఉదాసీనక్రైస్తవులు (హెబ్రీ 2:2-3).

హృదయ కాఠిన్యులు (రోమా 2:5-8).

వేషధారులు (మత్తయి 23:25-23).

## నరకశిక్ష

నరకము నిత్యశిక్ష అనుభవించే స్థలమని బైబిలు బోధించుచున్నది.

అది సిద్ధపరచబడిన స్థలము (మత్తయి 25:41)

అగ్నిగంధకములతో మండు గుండము (ప్రకటన 20:15)

అక్కడ అగ్ని ఆరదు; పురుగు చావదు (మార్కు 9:43)

గాఢాంధకారముగల ప్రదేశము (యూదా:13)

అంతులేని అగాధము (ప్రకటన 20:1)

దేవుని సముఖమునుండి పారదోలబడుట (2 థెస్స 1:7-9).

కటిక చీకటిగల బిలము (2 పేతురు 2:4)

## నరకబాధ

నరకము ఘోరమరణబాధలుగల స్థలమని బైబిలు బోధించుచున్నది:

దానిలోయున్నవారు కనికరముకొరకు అంగలార్చుదురు (లూకా 16:24)

విశ్రాంతి దొరుకదు (ప్రకటన 14:11)

గొప్ప ఏడ్పు పండ్లు కొరుకుట యుండును (మత్తయి 8:12)

జ్వాలవలన యాతనపడుదురు (లూకా 16:25)

ఒక్క నీటిచుక్క కొరకు అంగలార్చుదురు (లూకా 16:24)

వెలుపలి చీకటి (మత్తయి 8:12)

గొప్పబాధ (ప్రకటన 20:10)

గంధకముతో మండు అగ్నిగుండము అది (ప్రకటన 19:20)

## నిత్యము ఉండు నరకము

నరకములో ప్రవేశించువారికి అది నిత్యము ఉండునని బైబిలు బోధించుచున్నది:

దండన నిత్యము ఉండును (2 థెస్స 1:9)

యుగయుగములు రాత్రింబవళ్లు బాధింపబడుదురు (ప్రకటన 20:10)

రాత్రింబగళ్ళు, నిత్యము బాధననుభవింతురు (ప్రకటన 14:3-11)
పరలోకము ఎంత నిత్యమో నరకము అంతే నిత్యము
(మత్తయి 25:46)

అది నిత్యము ఉండునది (యూదా:13)

## మా విజ్ఞాపన

ఎవడును నశింపవలెనని దేవుడు కోరుటలేదు. ఆయన గొప్ప ప్రేమవలన మనకు బదులుగా ఆయన తన కుమారుని యిచ్చెను (యోహాను 3:16). దేవుడు ప్రేమయై యున్నాడు (1 యోహాను 4:8). ఆయన న్యాయవంతుడు కూడా. ఆయన ఇచ్చిన పాప ప్రాయశ్చిత్త బలిని నిరాకరించువారు, నమ్మకమైన దేవుని బిడ్డలుగా జీవించుటకు నిరాకరించువారు నరకములో పడద్రోయ బడుదురు; ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). "ప్రేమయైన దేవుడు నిత్యయాతన గల ప్రదేశమునకు నన్ను ఎట్లు పంపగలడు ?" అని కొందరు అడుగుదురు. దానికి జవాబుగా "మానవుని బుద్ధిహీనత తిరుగుబాటులే గాని దేవుని ప్రేమ లోపించుటవలన ఒకడు నరకములో ప్రవేశింపడు" అని మనము చెప్ప వచ్చును. మన పరలోకపు తండ్రి ప్రతి మానవునికొరకు ఒక రక్షకుని, రక్షింపబడే విధానాన్ని యిచ్చి ఆయనతో నిత్యము పరలోకమందు జీవించేలాగున అవకాశము కల్పించి యున్నాడు. ఈ జీవిత కాలములో ఆయన ప్రేమను, కనికరమును నిరాకరించువారు నరకమునకు పాత్రులే. మరోవిధముగా దేవుడు న్యాయవంతుడు కాజాలడు.

దేవుడు ఏ మానవుని నరకమునకు పంపించడు. మానవుడు తన తిరుగుబాటును బట్టియు, పాపమును బట్టియు తనకు తానే నిత్య నాశనములోనికి పోవును.

నరకము దాని గంభీరతలో ఒక అగ్ని గుండము (ప్రకటన 20:10, 14), దాని పొలిమేరలలో ఒక అగ్ని కొలిమి (మత్తయి 13:42), దాని సర్వసంపూర్ణతలో అనేక అగ్ని జ్వాలాగ్నిహోమము (మత్తయి

3:10-12). నరకమంటే సంపూర్ణముగా నిర్మూలించ బడుట లేక సమాధి యని కొందరు చెప్పుదురు. అయితే నరకము సమాధి, పూర్తిగా నిర్మూలించబడుట కాదుగాని అది నిత్యశిక్షయని యేసు విపులీకరించెను (మత్తయి 10:28).

నరకమంటే నవ్వులాటగా అపవాది మనలను భ్రమపరచ ప్రయత్నించుచున్నాడు. అయితే సత్యమునకు విధేయులు కానివారికి దివ్య ప్రేరితుడైన పౌలు ఒక భయంకర హెచ్చరిక నిచ్చుచున్నాడు. అట్టివారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును (రోమా 2:8, 9). "అప్పు డాయన యెడమవైపున ఉండువారిని చూచి, శపింప బడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచ బడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" యని చెప్పును (మత్తయి 25:41). అప్పుడు ఆ యాతన నుండి ఉపశమనము పొందు నిద్రమాత్రలు ఏమియు ఉండవు, మందులు దొరుకవు, విశ్రాంతి అంతకు ముందే యుండదు. అప్పుడు ఇంకొక తరుణము అనేది యుండదు; ఒక మంచి రోజును గూర్చిన నిరీక్షణ శూన్యము.

నీవు నశించిపోయిన యెడల నీవు పోగొట్టుకొనేది ఎంతో! నీవు పరదైసు యొక్క వైభవాన్ని, పరలోకపు సౌందర్యాన్ని, దేవుని నిత్య ప్రేమ యొక్క ఆదరణను, యుగయుగముల నుండి విమోచింప బడినవారి సహవాసమును, దేవుడు తన వారికిచ్చు సంతోషానందము లను నీవు పోగొట్టుకొందువు!

నీవు నిత్య నరకబాధ నుండి తప్పించుకొని పరలోకమే నీ నిత్య గృహముగా చేసికొనుటకు అవసరమయిన సహాయమును మేము సంతోషముతో ఇయ్యగలము. క్రీస్తు సంఘారాధనలకు, కూటములకు నిన్ను ప్రేమతో ఆహ్వానించుచున్నాము. రండి, దేవుని వాక్యమును మాతో పఠనము చేయండి, మాతో కలసి ఆరాధించండి. జీవముగల

దేవుని చేతిలో పడుట భయంకరము గనుక మీరేమి చేసినను, నర కమునకు పోవద్దని మేము మీకు విజ్ఞాపన చేయుచున్నాము.

—మేక్ లేటన్

## ఆనంద రహస్యము

## *(The Secret of Happiness)*

సంతోషానందములకొరకు ఈ లోకంలో అనేకులు తహతహ లాడుచు యుంటారు. అల్పకాల పాప భోగములలో సంతోషము దొరుకునని వారు భ్రమపడుదురు, గాని నిత్యసంతోషము మనకు ఎక్కడ లేక దేనిలో దొరుకునో కనుగొందము.

### సిరిసంపదలలో సంతోషమును పొందలేము

మనము ధనధాన్యములు, సిరిసంపదలు సంపాదించుటలో సంతోషమును అనుభవించలేము. "మరియు ఆయన వారితో మీరు ఏవిధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి, ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదనెను" (లూకా 12:15). దేవునికంటె ధనమును ప్రేమించువాడు సంతోషమును పొందలేడు. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను, నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మునుతామే పొడుచుకొనిరి ( I తిమోతి 6:9-10).

### అధికారశక్తిలోను, పలుకుబడిలోను సంతోషమును పొందలేము

చాలామంది అధికారదాహమునకు బానిసలైపోవుదురు. అధి కారము కూడా మనిషిని సంతోషపెట్టలేకపోవుచున్నది. చరిత్రలో చూచినట్లయితే నెపోలియన్, హిట్లర్, స్టాలిన్ మొదలగు వారి పలుకు

బడి సున్నముకొట్టిన గోడవలె అయినది. చివరకు వారు గుర్తించ బడలేని సమాధులపాలైనారు.

మనుష్యులమీద అధికారముచేయు వారినిగూర్చి క్రీస్తు ఈ విధముగా పలికెను: మీలో ఆలాగుండకూడదు. మీలో ఎవడు గొప్ప వాడై యుండగోరునో వాడు మీపరిచారకుడై యుండవలెను. మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు దాసుడై యుండవలెను (మత్తయి 20:26, 27). ఈవిధమైన కోరికగల వారిలో నిజమైన సంతో షమును కనుకొనగలము. "మీరు ఒకవేళ నీతి నిమిత్తము శ్రమపడినను మీరు ధన్యులే" (I పేతురు 3:14). సంతోషమనేది సంతృప్తిలోనే ఉన్నది.

## లోకసంబంధమైన జీవితమునందు సంతోషమును పొందలేము

మనము ఈలోకములో అనేకమైన వింతలు,విశేషములను చూచి నను, మనకు సంతోషమురాదు. జ్ఞానముగల సొలోమోనురాజు ఈ విధముగా చెప్పెను. "ఒకడు నవ్వుచుండినను హృదయమున దుఃఖ ముండవచ్చును. సంతోషము తుదకు వ్యసనమగును" (సామెతలు 14:13). యోహాను తన మొదటి పత్రికలో ఈవిధముగా వ్రాసినాడు: "ఈలోకమునైనను ఈలోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను ఈలోకమును ప్రేమించినయెడల తండ్రిప్రేమ వానిలో ఉండదు. లోకములో ఉన్నదంతయు అనగా శరీరాశయు, నేత్రా శయు, జీవపుడంభమును, తండ్రివలన పుట్టినవికావు. అవి లోకసంబంధ మైనవే" (I యోహాను 2:15, 16, 17). సొలోమోను ఈలోకసంబంధ మైన ధనమును, కీర్తిప్రతిష్టలను పొంది చివరకు ఇవన్నియు వ్యర్థమని అనుచున్నాడు. ప్రసంగి 2:1-11వరకు చదివినట్లయితే తన ప్రయాస అంతయు గాలికి ప్రయాసపడినట్టుగా అగుపడెను అని అతడు వ్రాసెను. సూర్యునిక్రింద లాభకరమైనదేదియు నాకు కనపడలేదని అతడు అనెను. ఇంతసామర్థ్యము కలవాడుకూడా విసుగుచెంది, సంతో షాన్ని పొందలేక పోయాడు.

## సంతోషమును మనము దేవునికి విధేయత చూపుటలో పొందగలము

సృష్టికర్తయైన దేవుడు తన సృష్టిఅంతా తనయందు సంతోషముగా ఉండవలెనని ఉద్దేశ్యము కలిగి యున్నాడు. కాని అవిధేయత వలన మనము దానిని పొందలేక పోవుచున్నాము. జ్ఞాని ఈవిదముగా అనుచున్నాడు : "ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే. దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయనకట్టడలను అనుసరించి నడుచుచుండవలెను. మానవకోటికిదియే విధి" (ప్రసంగి 12 : 13,14).

దేవుని నమ్మి ఆయనకు విధేయత కలిగి జీవించినపుడు మనము నిజమైన సంతోషమును పొందగలము. క్రీస్తు ఈవిధముగా చెప్పియున్నాడు, "ఈసంగతులు మీరు ఎరుగుదురు. గనుక వీటిని చేసినయెడల మీరు ధన్యులగుదురు (యోహాను 13:17).

— S. యోహాను, దోసకాయలపల్లి.

## తిరిగి జన్మించుట

## *(Born Again)*

తిరిగి జన్మించిన క్రైస్తవులను గూర్చి ఈ రోజుల్లో మనము చాల వినుచూ యున్నాము. నిజానికి ఒకడు తిరిగి జన్మించితేనే గాని అతడు దేవుని దృష్టిలో క్రైస్తవుడు కాజాలడు. అయితే బైబిలు బోధించు క్రొత్త జన్మ యేమిటో అనేకులకు తెలియదు, అదొక విచిత్రమైన భావన యని, నేరుగా పరిశుద్ధాత్మని పనియని, చెప్పటకంటె అనుభవించే భావన యని కొందరు తలంచురు. నీవు గలిబిలి యగుచున్నావా? క్రొత్త నిబంధనయొక్క క్రొత్త జన్మను మనము సులభముగా వివరించుకొనవచ్చును. "ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని" యేసు చెప్పెను (యోహాను 3:3). "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" యేసు మరల వివరించెను (యోహాను 3:5). క్రొత్త జన్మలో నీరు, పరిశుద్ధాత్ముడు ఇమిడి యున్నారు. ఆయన ఇంకా ఇట్లు చెప్పెను: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:15, 16). వాక్యము

ద్వారా పరిశుద్ధాత్ముడు జనింపజేయును (I కొరింథీ 4:15). మరియు బాప్తిస్మము నీటి భాగమైయున్నది (అపొ.కా. 8:36). బోధనద్వారా ఆత్మ విశ్వాసమును కలిగించును మరియు బాప్తిస్మము ఒకని క్రీస్తులోనికి ప్రవేశింపజేయును (గలతీ 3:27). క్రీస్తులోనికి ప్రవేశించుట, క్రీస్తు రాజ్యములోనికి ప్రవేశించుట యనునవి ఒకటే.

క్రీస్తు రాజ్యము, క్రీస్తు సంఘము అనునవి ఒక్కటే (మత్తయి 16:18, 19). క్రొత్తజన్మద్వారా రాజ్యములో ప్రవేశించు విధానమే ప్రభువు సంఘములో ప్రవేశించు విధానము. యిది విశ్వాసము, మారుమనస్సు, పాపక్షమాపణ నిమిత్తమైన బాప్తిస్మముద్వారా సాధ్యమగును (అపొ.కా. 2:36-38). అట్టి విధేయతగలిగి ఆత్మ మూలముగా జన్మించిన వారందరు ప్రభువుచే ఆయన సంఘమునకు చేర్చబడుదురు (అపొ.కా. 2:47).

—K.W. ఫ్రాంక్లిన్.

---

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA-533 001

**Printed Book only**

**To**

..............................................
..............................................
..............................................
..............................................